## మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

బచ్చన్నపేట, మే 2 : మండల కేంద్రం లోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ భారతీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ ఇంగ్లిష్ మీడియంలో 40 సీట్ల చొప్పున ఉన్నాయని తెలిపారు. ఆక్తిగల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## 5 వరకు సర్టిఫికెట్లు అందజేయాలి

స్టేషన్ ఘన్‌పూర్, మే 2 : రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 5 వరకు సర్టిఫికెట్లను అందజేయాలని మున్సిపల్ కమిషనర్ జీ రవీందర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 2024–25 సంవత్సరానికి రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన వారు తమ కులం, ఆదాయ, నివాస సర్టిఫికెట్లతో పాటు ఆధార్, పాన్, బ్యాంకు పాస్‌బుక్, ఫొటోలను జత చేసి ఈ నెల 5 సాయంత్రం 5 గంటల వరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అందించాలని ఆయన సూచించారు.

## కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

బచ్చన్నపేట, మే 2 : మండలంలోని గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్లను అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో మల్లికార్జున్, ఏవో విద్యాకర్‌రెడ్డి వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లి లబ్ధిదారుల ఇల్లు ఏ కేటగిరిలో ఉంది. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలను సేకరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఆదేశాల మేరకు ఇండ్లు నిర్మించాలని ఆదేశించారు. ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు నిర్మిస్తే బిల్లులు రావని వెల్లడించారు. ఇల్లు మంజూరైయిన లబ్ధిదారులు ఖాళీ స్థలంలో ముగ్గు పోయాలని, తర్వాత బేస్‌మెంట్, అనంతరం పనులు దశల వారీగా పూర్తి చేయాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.

## గుండె పోటుతో ఒకరి మృతి



రాజు (ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, మే 2 : డివిజన్ కేంద్రంలో గుండె పోటుతో ఒకరు మృతి చెందారు. డివిజన్ కేంద్రానికి చెందిన తాటికొండ (బండల) రాజయ్య(55)కు ఉదయం ఛాతి నొప్పి రాగా, స్థానిక దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే గుండెనొప్పితో మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**ఉచిత కంప్యూటర్ శిక్షణ**
★ఉచిత కంప్యూటర్ శిక్షణ (Tally, PGDCA) విద్యార్థి కంప్యూటర్స్, డాల్ఫిన్ హోటల్ గల్లీ, వరంగల్ చౌరస్తా, వరంగల్. T&C Apply.
NTW-6585

**PLOT FOR SALE**
★యాదాద్రికి సమీపంలో RRRకి దగ్గరలో మోత్కూర్ రోడ్ చీమలకొండూరు గ్రామంలో ఫార్మ్‌ల్యాండ్‌లో ప్లాట్స్ అమ్మబడును. Sq.yd.: 3,999/– మాత్రమే. వివరాలకు: 7989747927.
NT-330890

**CHANGE OF NAME**
★I, BOINI RAVINDAR, S/o. Malla Reddy Boini, R/o. 2-1-539/E, Adharsha Colony, Road No. 09, Hanamkonda, TS-506 001. Changed My Name as BOINI RAVINDER REDDY, S/o. Malla Reddy Boini.
NT-342903

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# నీట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు

### కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ఈవీఎం గోదాంలో రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ, మే 2(నమస్తే తెలంగాణ) : జిల్లాలో నీట్‌ను అత్యంత పకడ్బందీగా, పూర్తి సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. శుక్రవారం కలెక్టరెట్‌లోని నీట్–2025 ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు జిల్లా కేంద్రంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 582 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఇందుకు 49 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. ఏబీవీ డిగ్రీ కళాశాలలో 504 మంది విద్యార్థులు, 42 మంది ఇన్విజిలేటర్లు, పెంబర్తిలోని ఎంజేపీటీలో 78 మంది విద్యార్థులు, ఏడుగురు ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. సెంటర్‌లోకి ఎలాంటి ఆభరణాలు, ఎలక్ట్రానిక్, డిజిటల్ పరికరాలు, ఫోన్లు, వాచ్ సహా కర్చీఫ్ కూడా అనుమతించరని తెలిపారు. మధ్యాహ్నం 1.30గంటల లోపు వచ్చిన వారిని మాత్రమే సెంటర్‌లోనికి అనుమతిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వెరిఫికేషన్ మొదలవుతుందన్నారు. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ 3 దశలుగా సెక్యూరిటీ ఉంటుందని, ఎన్‌టీఏ పరిశీలకులతో పాటు జిల్లా పరిశీలకులు ఉంటారన్నారు. సమీక్షలో జిల్లా పరిశీలకురాలు గౌసియా బేగం, సిటీ కోఆర్డినేటర్ నర్సయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు రవీందర్ నాయక్, అనిత, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

**మంత్రి వీడియో కాన్ఫరెన్స్**

భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్లు, నీట్ పరీక్షపై హైదరాబాద్ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లాల కలెక్టర్లతో వీడియోగ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనగామ జిల్లా కలెక్టరేట్ నుంచి డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పలు సూచనలు ఇచ్చారు. జిల్లాలలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించాలన్నారు. నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అర్బన్ పీఎం ఆవాస్ యోజన కింద ప్రతి నియోజకవర్గ పరిధిలోని పట్టణ ప్రాంతాలలో కనీసం 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు. మే 10వ లోపు పూర్తి స్థాయిలో ఇండ్లు గ్రౌండ్ చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

**ఈవీఎం గోదాముల పరిశీలన**

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జనగామ సమగ్ర జిల్లా కార్యాలయంలోని ప్రధాన ఈవీఎం గోదామును శుక్రవారం పరిశీలించారు. భద్రతా నమోదు పుస్తకం, సీసీ కెమెరాల పని తీరు, నియంత్రణ పద్ధతులను పరిశీలించి, కట్టుదిట్టంగా భద్రత అమలు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.



మాట్లాడుతున్న డిప్యూటీ ఎస్‌వో వెంకట్‌రెడ్డి

## క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

పాలకుర్తి, మే 2 : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలతోనూ ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డిప్యూటీ ఎస్‌వో వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా యూత్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక వికాసానికి అత్యంత కీలకమన్నారు. విద్యార్థులు వేసవి వాలీబాల్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే, మండలంలోని చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై దూలం పవన్‌కుమార్, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, హెచ్‌ఎం శైలజ, పుల్లయ్య మాచర్ల, యాకలక్ష్మి, శ్రీనివాసరావు, చంద్రమోహన్, పీడీ చిట్యాల యాదగిరి, సందీప్, కారుపోతుల వెంకటయ్య, దొంతమల్ల గణేశ్, మొలూగూరి యాకయ్య, ఎండీ అబ్బాస్, పుస్కూరి రమేశ్‌రావు పాల్గొన్నారు.



మోహన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## బాధితుడికి ఎమ్మెల్యే పల్లా పరామర్శ

జనగామ రూరల్, మే 2 : మండలంలోని అడవికేశ్వాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బాదావత్ మోహన్ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం నుంచి జారిపడి తీవ్రంగా గాయపడడంతో పట్టణంలోని ఆయనను నీలిమా దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దవాఖానకు చేరుకొని బాధితుడిని పరామర్శించారు. మోహన్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు పూర్తిగా కొలుకునే వరకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. దీంతో ఎమ్మెల్యే పల్లాకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలు

### విచారణ చేపట్టిన డీపీవో

రఘునాథపల్లి, మే 2 : గతంలో రఘునాథపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన కవిత రూ.9.20లక్షల నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో శుక్రవారం డీపీవో నాగపురి స్వరూప మండల కేంద్రంలోని పంచాయతీలో విచారణ చేపట్టారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కవితపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు డీపీవో తెలిపారు. కవిత ప్రస్తుతం మండలంలోని వెల్ది పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. గతంలో రఘునాథపల్లిలో పనిచేసిన సమయంలో పన్నుల రూపంలో వసూలు చేసిన నగదును ఎస్టీవోలో జమ చేయకుండా నేరుగా ఖర్చు చేసినట్లు డీపీవో తెలిపారు. ప్రొసీజర్ ప్రకారం ప్రతి పైసాను మొదట ఎస్టీవోలో జమచేసి తర్వాత ఖర్చు చేయాల్సి ఉంటుందని, కానీ, కవిత వసూలైన మొత్తాన్ని పంచాయతీ పనుల నిమిత్తం ముందే ఖర్చు చేసి, ఆ తర్వాత బిల్స్ సబ్మిట్ చేసినట్లు చెప్పారు. ఇందులో అవినీతి జరిగిందా? లేదా అనే కోణంలో పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు వివరించారు. కాగా, కార్యదర్శి కవిత మాట్లాడుతూ తాను ఒక్క పైసా కూడా దుర్వినియోగం చేయలేదని, గ్రామ అవసరాల నిమిత్తమే వసూలైన డబ్బుల్లో నుంచి నేరుగా ఖర్చు చేసినట్లు తెలిపారు.



ట్రాక్టర్ నుంచి గడ్డిని బయటకు తీస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి ట్రాక్టర్ దగ్ధం

### ప్రమాదాన్ని తప్పించిన బీఆర్‌ఎస్ నాయకులు

కొడకండ్ల, మే 2 : మండలకేంద్రానికి చెందిన రైతు బొల్లి శ్యామ్ తన వ్యవసాయ భూమిలోని వరి గడ్డి మోపులను పశువుల కోసం ట్రాక్టర్ ద్వారా ఇంటికి తరలిస్తున్న క్రమంలో బస్టాండ్ వద్ద అమరవీరుల చౌరస్తాలో విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడే ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు వెంటనే స్పందించారు. ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న గడ్డి మోపులను కిందికి దించడంతో మంటల ఉధృతి తగ్గింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తహసీల్దార్ చంద్రమోహన్ స్పందించి ఫైర్ ఇంజిన్ రప్పించి మంటలను ఆర్పించారు.

## కంచనపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా జయరాములు



రఘునాథపల్లి, మే 2 : మండలంలోని కంచనపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఐత జయరాములు ఎన్నికైనట్లు డీసీవో కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దివ్య ప్రకటించారు. 12 మంది డైరెక్టర్లకు మండల కేంద్రానికి చెందిన చీమలపాడు రవీందర్‌జీ చైర్మన్‌గా ఉండగా కొన్ని రోజుల క్రితం అనారోగ్యం మృతి చెందాడు. శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో ఎన్నికలు నిర్వహించగా 11 మంది డైరెక్టర్లకు ఆరుగురు కంచనపల్లి గ్రామానికి చెందిన ఐత జయరాములును చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

## ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

హనుమకొండ చౌరస్తా, మే 2 : ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్‌ఎస్ బాల్ బ్యాడ్మింటన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి యంగ్‌స్టార్ హనుమకొండ, చల్లగరిగె, నర్సంపేట, హనుమకొండ వెటరన్స్, ఎల్లాస్వామి ఫైవ్స్, హనుమకొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ టీమ్స్ పాల్గొన్నాయి. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఎంపీ కడియం కావ్య హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహ్మద్ అజీజ్‌ఖాన్, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి ఒలింపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కైలాశ్ యాదవ్ పాల్గొన్నారు.

# అర్హులు బారెడు.. మంజూరు మూరెడు

- లబ్ధిదారుల ఎంపికలో తలలు పట్టుకొని తప్పకున్న అధికారులు
- ఇందిరమ్మ ఇండ్ల కమిటీలకు అప్పగింత
- ఇష్టారాజ్యంగా ఎంపికలు.. అర్హులకు రిక్త హస్తం

లింగాలఘనపురం, మే 2 : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలు గందరగోళంగా మారుతున్నాయి. కాంగ్రెస్ కార్యకర్తలకే దక్కుతూ అర్హులకు రిక్త హస్తం చూపిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అర్హుల జాబితా చాటంత ఉండగా, కొన్ని ఇండ్లే మంజూరు కావడంతో అధికారులు తలలు పట్టుకుని తప్పుకున్నారు. ఎంపిక బాధ్యతను ఇందిరమ్మ కమిటీలకు అప్పగించారు. వారు అర్హులను తప్పించి కాంగ్రెస్ కార్యకర్తకే కేటాయిస్తుండడంతో గ్రామాల్లో గొడవలు జరుగుతున్నాయి. మండలంలో దాదాపు 5 వేల మంది వరకు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు కూడా గ్రామాల్లో ఇంటింటా సర్వే చేసి, గ్రామ సభలను ఏర్పాటు చేసి జాబితాను ప్రకటించారు. ప్రతి గ్రామంలో వంద నుంచి 200 మందిని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ప్రకటించారు. అయితే, మండలానికి మొత్తం 435 ఇందిరమ్మ ఇళ్లను మాత్రమే కేటాయించారు. ఈ క్రమంలో మండలంలోని ప్రతి గ్రామానికి 25 ఇళ్లు కంటే ఎక్కువ కేటాయించని పరిస్థితి నెలకొంది. దీంతో కరవమంటే కప్పకు, విడువ మంటే పాముకు కోసం అన్న చందంగా మారింది అధికారుల పరిస్థితి. దీంతో వారు ఎంపిక ప్రక్రియ నుంచి తప్పుకుని, ఇందిరమ్మ కమిటీలకు బాధ్యతను అప్పగించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో కాంగ్రెస్ నాయకులు ఉండడంతో తమతమ అనుయాయులను(కాంగ్రెస్ కార్యకర్తల) ఎంపిక చేసి, లిస్టును ఎమ్మెల్యేకు అప్పగించారు. గ్రామ సభల్లో వరుస క్రమంలో ఉన్న లిస్టు మాయమై, ఆ స్థానంలో కాంగ్రెస్ కార్యకర్తల లిస్టు చేరడంతో అర్హులైన లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు. ప్రతి గ్రామంలో మొదటి వరుస క్రమంలో పది మంది అర్హులంటూ అధికారులు చదవగా నేడు ఆ పేర్లే గల్లంతవుతున్నాయి. దీంతో అర్హులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఫైనల్ లిస్టు ఇంకా అందలేదు**

ఇందిరమ్మ ఇండ్ల ఫైనల్ లిస్టు ఇంకా మా దగ్గరికి రాలేదు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు విచారణ చేస్తుండ్రు. ఎమ్మెల్యే నుంచి లిస్టు వచ్చాక మళ్లీ పరిశీలిస్తాం. అప్పుడు ఫైనల్ చేస్తం. ఊరికి ఎన్ని ఇండ్లు అనే విషయాన్ని వెల్లడిస్తాం.
– జలంధర్‌రెడ్డి, ఎంపీడీవో

**కాంగ్రెసోళ్లకే ఇండ్లు ఇస్తున్నరు**



కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నరు. మా ఊళ్లో గ్రామసభ పెట్టి 150 మందిని అర్హులుగా గుర్తించారు. ముందుగా గ్రామానికి మొదటి విడుతగా 24 ఇండ్లు మంజూరైనట్లు అధికారులు చెప్పి, సర్వే చేస్తున్నరు. ఇందిరమ్మ కమిటోళ్లు ఇష్టారాజ్యం, ఏక పక్షంగా ఇండ్లు కేటాయిస్తూ, అర్హులందరికీ మొండి చేయి చూపుతుండ్రు. ముందుగాల పేదలకు ఇయ్యాలని సర్కార్ చెప్తుంటే గ్రామాల్లో ఇందిరమ్మ కమిటోళ్లు ఆడిందే ఆట, పాడిందే పాటగా నడిపించుకుంటున్నరు. ఇలాగైతే ప్రభుత్వ ఆశయం నెరవేరుతదా? తిరిగి పునాలోచించాలె. అనర్హుల పేర్లు తీసేయ్యాలే. అర్హులకే ఇండ్లు ఇయ్యాలే.
– అప్పగోని ప్రదీప్, నేలపోగుల, లింగాలఘనపురం

**లిస్టులోంచి పేరు తీసేశారు**



నా పేరు శ్రీను. నాకు సొంతిల్లు లేక కిరాయికి ఉంటున్న, గ్రామంలో ఎలాంటి ఆస్తి పాస్తులు లేవు, 150 గజాల జాగ ఉంది. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో మొదటి పది మందిలో నా పేరు ఉండే. మల్ల ఏమైందో ఇప్పుడు పేరు కన్పించడం లేదు. ఇంత అన్యాయమా..? పేదోళ్లకు ఇయ్యాలని ప్రభుత్వం చెప్తుంటే గ్రామాల్లో రాజకీయాలు ఎక్కువ అయ్యాయి. వీడు మనోడేనా? వాడు మనోడు కాదు అని తెగ రాజకీయం చేస్తుండ్రు. అధికారులు, నాయకులు పూర్తి విచారణ జరిపి, నాకు న్యాయం చేయాలే.
– గుడిశాల శ్రీను, నేలపోగుల, లింగాలఘనపురం

## ధూప, దీప నైవేద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్, మే 2 : గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ధూప, దీప నైవేద్య పథకానికి దేవాదాయ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ పథకంలో ఎంపిక అయిన ఆలయాలకు ప్రతి నెలా రూ. 4 వేలతో పాటు అర్చకులకు రూ. 6 వేల గౌరవ భృతి చెల్లిస్తారు. ఈ నెల 24వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ తెలిపింది. దరఖాస్తులను దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని సంబంధిత అధికారులు తెలిపారు.


## 4న వెలమ సంక్షేమ సంఘం వార్షిక సమావేశం

న్యూశాయంపేట, మే 2 : హనుమకొండ పెద్దమ్మగడ్డలోని ఏఆర్ఆర్ గార్డెన్‌లో ఈ నెల 4న ఆదివారం ఉదయం 10.30గంటలకు ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం 30వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వెలమ బంధువులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఎల్ఆర్ఎస్ ప్రాసెస్ చేయడం లేదు

హనుమకొండ చౌరస్తా, మే 2 : ఎల్ఆర్ఎస్ 2015 స్కీంలో రూ.10 వేలు చెల్లించిన వారికి ఎల్ఆర్ఎస్ ప్రాసెస్ చేయడం లేదని లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ కుడా అధ్యక్షుడు పాము సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారి సమస్యలను వివరించారు. ఎల్ఆర్ఎస్ 2020లో స్కీంలో సుమారు 20 శాతం దరఖాస్తులు ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఉన్నాయని, దీని వల్ల దరఖాస్తుదారులను ఎన్‌వోసీలకు రికమండ్ చేస్తున్నారని చెప్పారు. దీని వల్ల ప్రజలు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలా, హెచ్‌టీ లైన్ దగ్గరలో ఉన్న ప్లాట్ల వారు ప్రొసీడింగ్స్ వస్తుందో రాదో అనే సందిగ్ధంలో ఉన్నారని తెలిపారు. సమావేశంలో శ్రీనివాస్, కోదండరాములు, గణేశ్‌బాబు, ఎండీ అహ్మద్ షరీఫ్, సుల్తాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ



పాలకుర్తి : అయ్యంగారిపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి/కొడకండ్ల, మే 2 : పాలకుర్తి మండలంలోని అయ్యంగారిపల్లిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ముస్కు సిద్ధులు, బుచ్చయ్య తల్లి ముస్కు శేషమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. శేషమ్మ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, పాలకుర్తిలో మాజీ ఉప సర్పంచ్ కాట బత్తిని రమేశ్ అత్తమ్మ కామారపు ఉపేంద్ర మృతి చెందగా ఆమె మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ముస్కు కర్ణాకర్, కడుదుల సంపత్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, తాజా మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, మాచర్ల ఎల్లయ్య, కడుదుల కర్ణాకర్‌రెడ్డి, ఎడవెల్లి కృష్ణ, ఉప్పల సాయి ఉన్నారు. అలాగే, కొడకండ్ల మండలంలోని లక్ష్మక్కపల్లికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కాటూరి కృష్ణమూర్తి తండ్రి కాటూరి యాదగిరి తెల్లవారుజామున మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శించారు. యాదగిరి స్వామి మృతదేహానికి నివాళులర్పించారు. అలాగే, మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు మహ్మద్ షన్నా ఇటీవల కాలి గాయంతో చికిత్స తీసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా అతడిని కూడా ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. అలాగే, మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పులుగుజ్జు సుధాకర్ తండ్రి పులుగుజ్జు రాములు ఇటీవల మరణించంగా బాధితులను ఎర్రబెల్లి పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందే రామోజీ, నాయకులు మసురం వెంకటనారాయణ, ప్రేమ్‌కుమార్, చెంచు రాజిరెడ్డి, దేశగాని సతీశ్, ప్రభాకర్, మంగ్యానాయక్, సతీశ్, వెంకటేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



## గ్యాస్ మండిపాయే.. కట్టెలే దిక్కాయె..

గ్యాస్ ధరలు పెరుగడంతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు మళ్లీ కట్టెల పొయ్యిలు వెలిగిస్తున్నారు. గ్యాస్ భారం తట్టుకోలేక కట్టెలు కొట్టుకుని మోపులను తీసుకువస్తున్నారు. జనగామ మండలం వడ్లకొండ గ్రామంలో వ్యవసాయ పనులను వెళ్లి తిరిగి వస్తున్న మహిళలు కట్టెల మోపులతో కనిపించగా 'నమస్తే తెలంగాణ' కెమెరాలో బంధించింది.
– జనగామ రూరల్



ఆలయ నూతన కమిటీ ఇదే..

## కూనూరు కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

జఫర్‌గఢ్, మే 2 : మండలంలోని కునూరు కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గ్రామ గొల్ల, కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బెల్లి రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాదనాల సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా బుల్లె లింగయ్య, కార్యదర్శిగా ఎక్కళ్ల సురేశ్, సహాయ కార్యదర్శులుగా ముక్కెర అశోక్, యాదనాల రాజు, నల్లబెట్ల సంతోష్, కమిటీ సభ్యులుగా బుల్లె సోమయ్య, యాదనాల కొమురెల్లి, ముక్కెర రమేశ్, నల్లబెట్ల చిన్న రాజు, బుల్లె రాజయ్య, బైకాని సారయ్య, బెల్లి పెద్దన్న, సకినాల పరశురాములు, ఎక్కళ్ల మల్లేశ్, బైకాని సంపత్, నాయిని విష్ణు స్వామి, బెల్లి అజయ్, కొండబోయిన శ్రీకాంత్, బుల్లె జయశంకర్ ఎన్నికయ్యారు.



విరాళం అందజేస్తున్న రవిప్రసాద్‌రెడ్డి

## నమిలిగొండ శివాలయం అభివృద్ధికి రూ.1.50లక్షల విరాళం

స్టేషన్ ఘన్‌పూర్, మే 2 : కోరిన కోర్కెలు తీర్చినందుకు గాను శివాలయానికి ఒకరు రూ.1.50లక్షల విరాళం అందించారు. వివరాల్లోకి వెళితే.. స్టేషన్ ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన సమయంలో రఘునాయకుల రవిప్రసాద్‌రెడ్డి నమిలిగొండ గ్రామంలోని శివాలయంలో పూజలు చేసేవాడు. తన పిల్లలకు మంచి ఉద్యోగం వచ్చి స్థిరపడాలని కోరుకున్నాడు. కాగా, ఇటీవల తన కొడుకుతో పాటు కూతురు రశ్మితారెడ్డి అమెరికాలో ఉద్యోగం సాధించి, మొదటి జీతాన్ని ఆలయ అభివృద్ధికి పంపించగా రవిప్రసాద్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కుమారస్వామి, స్థానికులు కన్నాంబ, అకారపు సంతోష్, అట్ల సుధాకర్, పెద్దపూండ్రు రాజు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎం ధరావత్ రాజును సన్మానిస్తున్న చిరంజీవి

## గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

స్టేషన్ ఘన్‌పూర్, మే 2 : ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల హెచ్‌ఎం ధరావత్ రాజును బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడానికి ఎంతో కష్టపడిన హెచ్‌ఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భూక్యా శ్రీనివాస్, ముదిరాజ్ యూత్ రాష్ట్ర కార్యదర్శి గోరంటాల యాదగిరి పాల్గొన్నారు.



నెల్లుట్ల–కుందారం మధ్య ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

## రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

లింగాలఘన్‌పూర్, మే 2 : రోడ్డు ప్రమాదాలపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, అతి వేగం ప్రమాదకరమని ఎస్సై శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన నెల్లుట్ల నుంచి కుందారం రోడ్డులో ప్రమాదాలు జరిగే స్థలాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపి, జీవితాలను బుగ్గిపాలు చేసుకోవద్దన్నారు. అతి వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. మలుపుల వద్ద జాగ్రత్తగా, నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.